క్లుప్తంగా

విద్యా వ్యవస్థ బలోపేతం

కురుపాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విద్యావ్యవస్థ బలోపేతమైందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వడ్డాది పాణికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో కొత్తగా 87 కేంద్రీయ విశ్వవిద్యాయాలు మంజూరు కాగా వాటిలో 8 ఆంధ్రప్రదేశ్‌కు మంజూరు కావడం గొప్ప విషయమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషితోనే ఇది సాధ్యమైందని తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి విద్యావ్యవస్థ బలోపేతం చేసేందుకు కృషి చేయలేదన్నారు.

విద్యుత్ దీపాల పంపిణీ

సీతంపేట: సోమగండి గ్రామ సచివాలయ పరిధిలో 13 గ్రామాలకు సంబంధించి 43 విద్యుత్ దీపాలను సర్పంచ్ రుతోని ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంజుల, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.గోపాలు, మహేష్, రామారావు, డిజిటల్ అసిస్టెంట్ గంగారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు మరమ్మతులు


బోరు బాగుచేస్తున్న పంచాయతీ సిబ్బంది

కురుపాం: మండల కేంద్రంలోని శోభలతాదేవి కాలనీలో తాగునీటి బోరు మరమ్మతులకు గురై బురదనీరు వస్తుండటంతో కాలనీవాసులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు వెంటనే స్పందించి మంగళవారం బోరును బాగుచేయించారు. ఈఓ కె.చంద్రశేఖర్, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ పనులను పర్యవేక్షించారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ


జియ్యమ్మవలస: ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న సెక్రటేరియల్ అధికారులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి, జియ్యమ్మవలస, చినకుదమ పాఠశాల సముదాయాలలో ఉపాధ్యాయులకు మంగళవారం ఒకరోజు వృత్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నూతన బోధన పద్ధతులు, మల్టిపుల్ ఛాయిస్ క్వశ్చన్ ఏవిధంగా తయారు చేయాలి, ఎలా బోధిస్తే విద్యార్థులు సులభంగా జవాబులు రాయగలరు అనే దానిపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు సీఆర్పీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కార్యదర్శులు సేవలందించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా గ్రామాల్లో అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు సేవలందించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులలో మేరా మట్టి–మేరా దేశ్, జగనన్న ఆరోగ్య సురక్ష, స్వచ్ఛత కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30 నుంచి అమలుకానున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు ముందుగా గ్రామాల్లో వైద్యాధికార సిబ్బంది చేస్తున్న సర్వే పూర్తి చేసేలా వారికి సహకరించాలని కోరారు. అలాగే స్వచ్ఛత హై కార్యక్రమంలో భాగంగా కాలువల్లో పూడికలు తీయించి, పారిశుద్ధ్య పనులు చేయించి, తీసిన చెత్తకుప్పలను దూరప్రాంతానికి తరలించాలని సూచించారు. విద్యుద్దీకరణ పనులు చేయించి వీధిలైట్లు వేయాలని, మంచినీరు పథకాలు వాటర్‌ట్యాంక్‌లు, బావుల్లో క్లోరినేషన్ చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలని కోరారు.

గణనాథునికి లక్షపత్రి పూజ

పార్వతీపురంటౌన్: వినాయక నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి వీధిలో గల కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం, వాసవి మహిళాసంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడికి మంగళవారం లక్ష పత్రి పూజ నిర్వహించారు. పార్వతీపురం ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, సమాజ శ్రేయస్సుకోసం పూజలు చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, ఉషాఫౌండేషన్ చైర్‌పర్సన్ ఐ.ఉషారాణి, కొత్తా నాగేశ్వరరావు, పూసర్ల చిన్ని కృష్ణ, కందుకూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● వసతుల పరిశీలన


గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని, అర్జీదారులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ఆర్డీఓ కె.హేమలత అన్నారు. కార్యక్రమం ఏర్పాట్లను మంగళవారం ఆమె పరిశీలించారు. అర్జీలు ఇచ్చేందుకు వచ్చేవారు ఇబ్బందులకు గురికాకుండా ఉండేలా అవసరమైన టెంట్లు, కుర్చీలు, తాగునీరు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ జి.పైడితల్లి, తహసీల్దార్ జీవీ జనార్దనరావును ఆదేశించారు.

● 'ఫ్రెషర్స్ డే' సందడి


భామిని: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఫ్రెషర్స్ డే'ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఈ వేడుక నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కళాశాలలో సందడి నెలకొంది. ప్రిన్సిపాల్ ఎర్రం నాయుడు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

● మెరుగైన సౌకర్యాలు


సీతంపేట: పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు ఉండాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. స్థానిక ఐటీడీఏలో గిరిజన సంక్షేమ విద్యాశాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. విద్యాభివృద్ధికి కృషిచేయాలని, ఉపాధ్యాయులకు ఉత్తమ శిక్షణ ఇప్పించాలని, భోజన మెనూ కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీడీ మంగవేణి, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, జీసీడీఓ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ


రైతులకు పాసుపుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందిచండం జరుగుతుందని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండలంలోని మరుపెంట పంచాయతీ తులసిరామినాయుడువలస గ్రామంలో పలువురు రైతులకు మంగళవారం పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం రీసర్వే నిర్వహించడం జరిగిందన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుకోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం


నాటుకోళ్ల పెంపకందారులతో మాట్లాడుతున్న అధికారులు

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో నాటుకోళ్లు పెంచుతున్నతీరుపై ట్రికార్ జనరల్ మేనేజర్ మణికుమార్‌తో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల బృందం ఆరాతీశారు. ఈ మేరకు మంగళవారం సీతంపేట ఏజెన్సీలో పర్యటించారు. వాసన్, ఆర్ట్స్ సంస్థల ఆధ్వర్యంలో మండలంలోని మండదీసరిగూడ, చిన్నరామలో నిర్వహిస్తున్న నాటుకోళ్ల యూనిట్లను పరిశీలించారు. పెంపకందారులతో మాట్లాడారు. ఎన్ని కోళ్లు పెంచారు, ఒక్కో కోడిని ఎంత ధరకు విక్రయించారు, ఎంత ఆదాయం వచ్చింది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌బీఏజీఆర్ రిటైర్డ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బీకే సదాన మాట్లాడుతూ.. నాటుకోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం వస్తుందన్నారు. మిగతా ప్రాంతాల్లో కూడా నాటుకోళ్ల పెంచుకునేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు సంబంధించి బుధవారం విశాఖపట్నంలో కేంద్ర పశుసంవర్ధకశాఖ కమిషనర్ అభిజిత్ మిత్రాతో 10 రాష్ట్రాలకు చెందిన రైతులు, అధికారులతో సెమినార్ ఉందన్నారు. అందులో నాటుకోళ్ల పెంపకం, రైతులకు వచ్చే ఆదాయ వనరులపై చర్చించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఆర్ఏ నెట్‌వర్క్ డైరెక్టర్ సభ్యసాచి, వాసన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సన్యాసిరావు, రీజనల్ కోఆర్డినేటర్ కళ్యాణ్ పాత్రో, ప్రోగ్రాం మేనేజర్ జయప్రకాష్, పోగ్రాం అసిస్టెంట్ మనోజ్‌కుమార్, ఆర్ట్స్ సమన్వయకర్త బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి


మాట్లాడుతున్న ఎంఈఓ భాస్కరరావు

భామిని: మండలంలోని బాలేరు జెడ్పీహెచ్ స్కూల్‌లో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ జామి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంఈఓ వి.భాస్కరరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయపాలన కచ్చితంగా పాటించాలని సూచించారు. బోధించిన పాఠ్యాంశాలను విద్యార్థులు ఎంతవరకు గ్రహించారో తెలుసుకోవడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్లు అందేలా చూడాలని హెచ్‌ఎంలకు సూచించారు. కాంప్లెక్స్ టీచర్లు, సీఆర్‌పీ సంజీవరావు, ఎంసీఓ రామకృష్ణ పాల్గొన్నారు.

విస్తృతంగా ఆరోగ్య సర్వే..


సీతంపేట: జగనన్న ఆరోగ్య సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ


పాలకొండ రూరల్: ఇంటింట సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్బన్ పీహెచ్ వైద్యాధికారి తేజ రత్నరాజు నేతృత్వంలో వైద్య సిబ్బంది మంగళవారం పలు వార్డుల్లో ఇంటింట సర్వే చేపట్టారు. ప్రతీ ఇంట్లో సభ్యుల సంఖ్య, వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి బీపీ, సుగర్, రక్తహీతన నిర్ధారణ పరీక్షలు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందించే వైద్య సేవలపై అవగాహన కల్పించారు.

● సీతంపేట: మండలంలోని రసూల్‌పేటలో మంగళవారం చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వేను ఎంపీడీఓ కె.సత్యం పరిశీలించారు. సర్వే వివరాలపై ఆరాతీశారు. పకడ్బందీగా సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు.

వైఎస్సార్ బీమా అందజేత


నగదు అందజేస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ తదితరులు

సీతంపేట: మండలంలోని రేగుమానుగూడ గ్రామానికి చెందిన సవర గయ్యారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆమె కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజూరైంది. తక్షణ సాయంగా రూ.10వేలును అధికారులు మంగళవారం గయ్యారమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని నామినీ బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని ఎంపీడీఓ కె.సత్యం తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సవర సుమతి, కార్యదర్శి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోక్‌పిట్లు ఏర్పాటు చేయాలి


జగనన్న లేవుట్‌లో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ జానకీరాం

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో గల ఇళ్ల ప్రాంగణాల్లో లబ్ధిదారులు సోక్ పిట్ నిర్మాణం చేపట్టాలని గృహనిర్మాణ శాఖ ఏఈ జనకీరాం కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన పెదభోగిలి, సీతానగరం జగనన్న కాలనీల్లో ఇంజినీరింగ్ సహాయకులు సంతోష్‌కుమార్, ఎన్ఆర్ఈజీఎస్ క్షేత్ర సహాయకులు అప్పలనాయుడు కలిసి లబ్ధిదారులకు సోక్‌పిట్‌ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 20 సచివాలయాల పరిధిలో ప్రభుత్వం అమలు చేసిన జగనన్న లేఅవుట్లలో నిర్మించిన ఇళ్ల లబ్ధిదారులు ఇళ్లలో వాడుకనీరు, వర్షం నీరు నిల్వ ఉండేవిధంగా సోక్ పిట్లు దోహద పడతాయన్నారు. సోక్ పిట్ నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.6 వేలు చెల్లించనుందని తెలిపారు. నీరు కొంతసమయం నిల్వ ఉండడంతో భూమిలోకి నేరుగా మళ్లించడానికి వీలవుతుందన్నారు. వృథానీరు ఆరుబయట ఉండడంతో దోమలు పెచ్చరిల్లి, ప్రజలను అస్వస్థతకు గురి చేస్తాయని చెప్పారు. ప్రభుత్వం సమకూర్చిన ఆర్థిక సహాయంతో ప్రతి ఇంటి ప్రాంగణంలో సోక్ పిట్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ మేరకు సీతానగరం జగనన్న లే అవుట్‌లో 8 మంది లబ్ధిదారులు సోక్ పిట్ నిర్మాణం చేస్తామని ముందుకు వచ్చారు.

ఇళ్లలోనే వైద్యపరీక్షలు

● డాక్టర్ రాధాకాంత్


నిడగల్లులో వైద్య సిబ్బంది చేస్తున్న పరీక్షలను పరిశీలిస్తున్న పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇళ్లలోనే ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన నిడగల్లులో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న 7 రకాల వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామాల్లో సచివాలయ ఉద్యోగుల సహకారం తీసుకుని వైద్యసిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇంటింటికీ వెళ్లి అవసరమనుకున్న వారందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. వైద్య పరీక్షల అనంతరం రోగ నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నిర్వహించిన సర్వే రిపోర్టుల ఆధారంగా నిపుణులైన డాక్టర్లు, పీహెచ్‌సీ డాక్టర్ల బృందం ఈ నెల 30 నుంచి రోగ నిర్ధారణ చేసి అవసరమైన వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. ఈ క్రమంలో 30న బూర్జలో డాక్టర్ల బృందం జగనన్నఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభం కానున్నందున ఇప్పటికే బూర్జలో వైద్య పరీక్షల నిర్వహణ పూర్తి కావచ్చిందని తాజాగా నిడగల్లులో ఇంటింటా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు సేవలందించడానికి ఇంటింటికి వస్తున్న వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

వాహనాల వేలం


వాహనాల వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

సీతంపేట: మద్యం అక్రమ రవాణా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో మంగళవారం వేలం వేశారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు సమక్షంలో ఈ వేలం నిర్వహించారు. మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో వేలం వేయగా.. ఆటో వేలం పాటకు ఎవరూ ముందుకు రాలేదు. ద్విచక్ర వాహనాలను రూ.86,600లకు పాటదారులు దక్కించుకున్నారు. దీనికి అదనంగా 18 శాతం జీఎస్టీని పాటదారులు చెల్లించాల్సి ఉంటుందని ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు.

● గుమ్మలక్ష్మీపురం: సారా కేసుల్లో సీజ్ చేసిన నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం వేలం వేశారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు వేలాన్ని పర్యవేక్షించారు. ఆయనతో పాటు సీఐ సత్యనారాయణ, ఎస్సై షణ్ముఖరావు ఉన్నారు.

ఐటీఐ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్


మరియగిరి సమీపంలో ఐటీఐ నిర్మాణానికి కేటాయించిన స్థలం

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ నిరంతరం కృషి చేస్తునే ఉన్నారు. వీరఘట్టం మండలంలో ఐటీఐ నిర్మాణానికి ఇటీవల వారు ప్రతిపాదించారు. తాజాగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా.. ఆయన అంగీకారం తెలిపినట్లు ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ మంగళవారం తెలిపారు. ఐటీఐ ఏర్పాటుకు వీరఘట్టంలోని మరియగిరి వద్ద సర్వే నంబరు 5/1లో ఉన్న 5 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించనున్నారు. వీరఘట్టం–వంగర మండలాలను అనుసంధానం చేస్తూ కిమ్మి–రుషింగి గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న వంతెన పనులను గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేసిందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పెండింగ్ బిల్లులు మంజూరు చేయించామన్నారు. అలాగే ఎన్నో ఏళ్లుగా విస్తరణకు నోచుకోని వీరఘట్టం ప్రధాన రహదారిని రూ.5.50 కోట్లు అభివృద్ధి చేస్తున్న ఘనత కూడా వైఎస్సార్‌సీపీదేనని అన్నారు. త్వరలో వీరఘట్టం మండలానికి ఐటీఐ కాలేజీ రానుండడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి


కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న గణిత ఉపాధ్యాయులు

వీరఘట్టం: విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరచాలని ఎంఈఓ జి.గౌరినాయుడు సూచించారు. మండలంలోని కంబరవలస, వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. కంబరవలసలో తెలుగు సబ్జెక్టుపై, వీరఘట్టంలో గణిత సబ్జెక్టుపై సమావేశం నిర్వహించారు. భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టాలి, విద్యార్థులకు అర్థమయ్యేలా సులభంగా ఎలా బోధించాలి అనే అంశాలపై చర్చించారు.

రెవెన్యూ అధికారులు సహకరించాలి


తహసీల్దార్ అప్పారావును కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: గ్రామాల్లో ఇళ్లు లేని పేదలకు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి రెవెన్యూ అధికారులు సహకరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం తహసీల్దార్ నీలాపు అప్పారావును కోరారు. ఇంటి స్థలం ఉండి, పక్కా ఇల్లు లేని పేదలను గుర్తించి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని వీఆర్వోలకు సూచించారు. గృహ నిర్మాణ శాఖ పరిధిలో దరఖాస్తుకు ఆప్షన్ ఇచ్చి ఉన్నందున త్వరితగతిన మంజూరు చేయాలని జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, పార్టీ నాయకులు మేడిబోయిన చలపతి, అగతముడి శేషగిరి తహసీల్దార్‌ను కోరారు. చురుకైన వీఆర్‌ఓలకు పొజిషన్ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఖాళీగా ఉన్న వీఆర్‌ఓల స్థానాల్లో ఇన్‌చార్జ్‌లను నియమించి ప్రజలకు త్వరితగతిన రెవెన్యూ సేవలందేలా చూడాలని కోరారు.

నేడు గరుగుబిల్లిలో 'జగనన్నకు చెబుదాం'

పార్వతీపురం: మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని గరుగుబిల్లిలో బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గరుగుబిల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను సమర్పించవచ్చన్నారు. అలాగే ఈనెల 29న పాలకొండ, అక్టోబర్ 4న జియ్యమ్మవలస, 6న వీరఘట్టం, 11న కురుపాం, 13న సీతంపేట, 18న సాలూరు, 20న పాచిపెంట, 25న భామిని, 27న గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

డ్రాపౌట్ల గుర్తింపు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మండ గ్రామ సచివాలయం పరిధిలో డ్రాపౌట్ విద్యార్థిని ఆరిక మౌనికను వెల్ఫేర్ అసిస్టెంట్ జి.రాము మంగళవారం పాఠశాలలో చేర్పించారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాల మేరకు ఎంఈఓలు, ఎంపీడీఓ, సీఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించి డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి బడిలో చేరుస్తున్నారు. ఇందులో భాగంగా అనివార్య కారణాలతో చదువు మధ్యలోనే మానేసిన మౌనికను గుర్తించి కేడీ కాలనీ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించినట్లు వెల్ఫేర్ అసిస్టెంట్ తెలిపారు.

వైభవంగా విఘ్నేశ్వర పూజలు


భామిని: నేరడి ఎస్సీ కాలనీలో గణపతి ఊరేగింపు


పాలకొండ రూరల్: వరసిద్ధి వినాయక మండపంలో సామూహిక పూజలు

పాలకొండ రూరల్: పట్టణంలో కొలువుతీరిన విఘ్నేశ్వర మండపాల్లో ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు. పట్టణంలోని పెద్దగొల్లవీధి, రెల్లివీధి, కొత్తవీధితో పాటు దేవరపేట, వైఎస్సార్‌వీధిలో కొలువైన వరసిద్ధి వినాయక మండపాల్లో మంగళవారం గణపతికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి కుంకుమ, గరిక పూసలు, పసుపు కొమ్ములతో పూజలు చేశారు. ఘటాలడెప్పి వీధిలో కొలువైన ధైర్య గణపతి మండపంలో దంపతులు పూజలు చేశారు.

సందడిగా నిమజ్జనోత్సవాలు

భామిని: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నిమజ్జనోత్సవాలు మంగళవారం సందడిగా సాగాయి. నేరడి–బి, సొలికిరి, ఘనసర, బిల్లుమడ, బురుజోలలో వినాయక విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి వంశధార నదిలో నిమజ్జనం చేశారు. డీజే పాటలకు యువత ఉత్సాహంగా డాన్సులు చేస్తూ సందడి చేశారు.


గరుగుబిల్లి: పెద్దూరులో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పెద్దూరులో అన్నసమారాధన

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు గ్రామంలోని బీసీ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో శ్రీరామభక్త భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుమారు 2,500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అనుపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తెర్లి యల్లంనాయుడు, భజన మండలి సభ్యులు గంట సింహాచలం, లచ్చిపతుల చిన్నారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.